ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

మంగళవారం 20 ఆగస్టు 2024

ఊపిరాడటం లేదు..

విషం చిమ్ముతున్న పరిశ్రమలు

కాల్వలై పారుతున్న వ్యర్థ జలాలు

శాంపిల్స్ తీసుకొని చేతులెత్తేస్తున్న పీసీబీ

ఫిర్యాదు చేసినా.. పట్టని వైనం

7 లో



తూప్రాన్‌లో రాఖీల దుకాణం వద్ద మహిళల సందడి

రాఖీ సందడి

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు. సోదరులకు రాఖీలు కట్టడానికి తరలివచ్చిన తోబుట్టువులతో గృహాలు కళకళలాడాయి. పుట్టింటికి వెళ్లేందుకు మహిళలు తరలిరావడంతో బస్సులు కిటకిటలాడాయి. వాహనాలతో రోడ్లు రద్దీగా మారాయి. రోజంతా వర్షం కురియడంతో ప్రయాణానికి ఇబ్బందులు తప్పలేదు...



మెదక్ కలెక్టర్‌కు రాఖీ కడుతున్న బాలసదనం చిన్నారులు



జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్‌కు రాఖీ కడుతున్న సోదరి

మెదక్ జిల్లాలో 11 మంది

తహసీల్దార్లకు స్థానచలనం

మెదక్, ఆగస్టు 19: మెదక్ జిల్లాలో 11 మంది తహసీల్దార్లు, ఇద్దరు సూపరింటెండెంట్లను బదిలీ చేస్తూ కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్ మండలం తహసీల్దార్ శ్రీనివాస్‌ను నర్సాపూర్‌కు, పాపన్నపేట తహసీల్దార్ లక్ష్మణబాబును మెదక్‌కు, అల్లాదుర్గం మండల తహసీల్దార్ సతీష్‌కుమార్‌ను పాపన్నపేటకు, హవేళీఘనపూర్ తహసీల్దార్ నారాయణను చేగుంటకు, టేక్మాల్ తహసీల్దార్ జి.కృష్ణను వెల్దుర్తికి, వెల్దుర్తి తహసీల్దార్ తులసీరాంను టేక్మాల్‌కు, కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్లుగా పనిచేస్తున్న హర్దీప్‌సింగ్‌ను హవేళీఘణపూర్‌కు, మల్లయ్యను అల్లాదుర్గంకు బదిలీ చేశారు. శివంపేట తహసీల్దార్ శ్రీనివాస్, చేగుంట తహసీల్దార్ గియాసున్నిసా బేగంను జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. నేటి నుంచి ఓటరు జాబితా సవరణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో బదిలీ అయిన తహసీల్దార్లు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.

నేటి నుంచి రుణమాఫీ గ్రీవెన్స్

అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు

మెదక్/సంగారెడ్డి రూరల్, ఆగస్టు 19: రుణమాఫీకి అన్ని అర్హతలు ఉండి.. పలు కారణాల మూలంగా అప్పు మాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కోసం అన్ని మండల కేంద్రాల్లో వ్యవసాయశాఖ అధికారి నేతృత్వంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. మంగళవారం నుంచి ఈ కేంద్రాల్లో రుణమాఫీ కాని రైతుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇప్పటికే మూడు విడతల్లో రుణమాఫీ జరగగా, బ్యాంకు ఖాతాలు సరిగ్గా లేకపోవడం, ఆధార్ నంబర్లలో తప్పులు.. రైతు ఖాతాను ధ్రువీకరించకపోవడం వంటి సాంకేతిక కారణాలతో కొందరు రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమకాలేదు. ఈ నేపథ్యంలో అర్హులైన రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. వ్యవసాయాధికారులు రైతుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను స్వీకరించి, పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ వివరాలను ఉన్నతాధికారులు పరిశీలించి రుణమాఫీకాని రైతులకు న్యాయం చేసే అవకాశం ఉంటుంది.

రైతు రుణమాఫీ కోసం మండలానికో నోడల్ ఆఫీసర్‌ను నియమించినట్టు సంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి నర్సింహరావు ఓ ప్రకటనలో తెలిపారు. రుణమాఫీకి అర్హతలున్న రైతులు నోడల్ అధికారులకు తగిన పత్రాలు అందజేసి రుణమాఫీ పొందాలని సూచించారు.

స్పెషల్ బస్సుల పేరిట బాదుడు

నారాయణఖేడ్, ఆగస్టు 19: స్పెషల్ బస్సుల పేరిట ఆర్టీసీ ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలను వసూలు చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి 20 వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నది. ఖేడ్‌తో పాటు ఇతర డిపోల వారు కూడా బస్సులు నడుపుతున్నారు. ఖేడ్ నుంచి సంగారెడ్డికి సాధారణంగా ఒక్కొక్కరికి రూ.130 చార్జీలు ఉంది. నారాయణఖేడ్ డిపో ప్రత్యేక బస్సులో అంతే వసూలు చేస్తున్నారు. కానీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన బస్సులో మాత్రం ఇదే దూరానికి రూ.170 వసూలు చేశారు. సాధారణ సిటీ బస్సునే స్పెషల్ పేరిట నడుపుతూ 30 శాతం కంటే ఎక్కువ ఛార్జీ వసూలు చేయడం గమనార్హం. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం మల్లేశయ్యను ప్రశ్నించగా నారాయణఖేడ్ డిపో బస్సుల్లో సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నామని, ఇతర డీపోల బస్సుల గురించి తమ దృష్టికి రాలేదన్నారు.



ఖేడ్ నుంచి సంగారెడ్డికి హెచ్‌సీయూ బస్సులో ఇచ్చిన రూ.170 టికెట్

హుండీ.. దైవాధీనమండి!

- ఆదాయంపైనే దృష్టి
- రక్షణను పట్టించుకోని వైనం
- ఆలయాలను టార్గెట్ చేస్తున్న దొంగలు

- పలుచోట్ల నిద్రపోతున్న నిఘా
- పనిచేయని సీసీ కెమెరాలు
- ఆరునెలల్లో పలుచోట్ల ఘటనలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఆగస్టు 19: "మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో ఈనెల 9న గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగలగొట్టి భక్తులు సమర్పించిన నగదు, కానుకలను అపహరించారు. గుడి సమీపంలో సుమారు 30 సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ కేవలం ఐదారు మాత్రమే పనిచేస్తున్నాయి. దీంతో ఇప్పటి వరకూ దొంగల ఆచూకీ కనుగొనలేదు".

"ప్రసిద్ధిగాంచిన వర్గల్‌లోని విద్యాధరి ఆలయంలో ఈనెల 8న చోరీకి యత్నించారు. నలుగురు వ్యక్తులు ముసుగులు ధరించి విద్యుత్ సరఫరాను నిలిపివేసి మండపంలోని ప్రవేశద్వారా వద్ద తాళాలు ధ్వంసం చేశారు. సిబ్బంది అప్రమత్తం కావడంతో ఓ కత్తిని వదిలేసి ఉడాయించారు."

ఏ దిక్కూ లేనివారికి దేవుడే దిక్కంటారు. కానీ ఆ దేవుడికి కూడా దిక్కులేని పరిస్థితి ఉమ్మడి మెదక్ జిల్లాలో కనిపిస్తుంది. ఆలయాలను టార్గెట్ చేస్తూ చోరీలకు తెగబడటం నిత్యకృత్యంగా మారుతోంది. హుండీలు కొల్లగొడుతున్నా కూడా ఆలయాల నిర్వాహకులు అలసత్వంగానే ఉంటున్నారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల వనదుర్గ ఆలయం, వర్గల్ విద్యాధరి క్షేత్రాలనూ దొంగలు వదలకపోవడం గమనార్హం.



మాసాయిపేటలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ధ్వంసం చేసిన హుండీ



అల్లాదుర్గం మండలం రాంపూర్ పెద్దమ్మ ఆలయంలోని హుండీ ధ్వంసం



శివ్వంపేట మండలం చండీ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయ హుండీని కొల్లగొట్టిన దొంగలు



టేక్మాల్ మండలం బొడ్మాట్‌పల్లిలోని భద్రకాళి అమ్మవారి మంగళసూత్రం, ముక్కుపుడక అపహరణ



పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గ ఆలయంలోని హుండీలను కొల్లగొట్టి బయటపడేసిన దృశ్యం

నిఘా లోపం.. ఆలయాలకు శాపం

జనసంచారం కలిగిన ప్రాంతాల్లో నిఘా వ్యవస్థ పటిష్ఠంగా ఉండేలా పోలీసు యంత్రాంగం దృష్టిపెట్టాల్సి ఉంటుంది. ప్రధానంగా ఆలయాల్లో ప్రత్యేక నిఘా తప్పనిసరి. సిబ్బందితో పాటు 24 గంటల పాటు పర్యవేక్షించేలా సీసీ కెమెరాల ద్వారా నిఘా పెట్టాల్సిన అవసరం లేకపోలేదు. అదే విధంగా ఆలయంతోపాటు హుండీలు, ఇతర వస్తువులను రక్షించడానికి సంబంధిత ఆలయ నిర్వాహకులూ అప్రమత్తంగా ఉండాలి. కానీ హుండీ ఆదాయంపై ఉన్న శ్రద్ధను వాటి రక్షణపైనా చూపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆలయ ఆదాయంతో సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను పటిష్ఠం చేసే దిశగా ఆలోచించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల వల్లనే దొంగలు ఆలయాలను ఎంచుకుంటున్నారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తుల రాకపోకల దృష్ట్యా మిగతా సమయాన్ని తమకు అనువుగా మలుచుకుని దోపిడీకి పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల్లో జరిగిన దొంగతనాలన్నీ అర్ధరాత్రి తర్వాతనే జరగడం గమనార్హం.



వర్గల్‌లోని విద్యాధరి క్షేత్రంలో తలుపులు పగలగొట్టిన దొంగలు



రాయపోల్ మండలం రాంసాగర్ పెద్దమ్మ ఆలయంలో ధ్వంసమైన హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

హుండీ సొమ్ము హుష్‌కాకి..

భక్తులు సమర్పించిన నగదు, కానుకలు, బంగారం, వెండి వస్తువులను హుండీల్లో వేస్తుంటారు. కొన్ని ఆలయాల్లో ఏడాదికోసారి ఇంకొన్ని చోట్ల ఆర్నెళ్లకు, మూడునెలలకు, నెలకోసారి హుండీ నగదు లెక్కిస్తుంటారు. లెక్కిస్తేకానీ ఇందులో ఎంత నగదు ఉందనేది తేలదు. తాజాగా హుండీలనే దొంగలు టార్గెట్ చేస్తుండడంతో దొంగిలించిన సొత్తుపై అంచనాలు ఉండడం లేదు. సొమ్ము రికవరీ సమయంలోనూ దొంగలు చెప్పిందే నమ్మాల్సిన పరిస్థితి. దొంగతనం జరిగినట్లుగా ఆలయాల నిర్వాహకులు ఫిర్యాదులు చేసినప్పటికీ హుండీ సొమ్ము ఎంతనే విషయాన్ని అస్పష్టతగానే పేర్కొనాల్సి వస్తోంది. ఇక దేవుళ్లపై ఉన్న బంగారు, వెండి వస్తువులు, ఇతర వస్తువులను సైతం దొంగలు వదలడం లేదు. దొంగలు అపహరించేలా, సాదాసీదాగా తెరుచుకునేలా హుండీలు ఉన్నందునే ఈ పరిస్థితి తలెత్తుతోంది. కట్టుదిట్టమైన హుండీలను ఏర్పాటు చేయాలని, లేదంటే హుండీలకు సరైన భద్రతపై దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు.



పటాన్‌చెరు మండలం రుద్రారంలోని వీరాంజనేయ ఆలయంలోని హుండీ పరిస్థితి

మరిన్ని ఘటనలు..

- మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చండీ ఎల్లమ్మ ఆలయంలో 20 రోజుల క్రితం హుండీని ధ్వంసం చేసి నగదు అపహరించారు.
- మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో రెండుసార్లు చోరీ జరిగింది. హుండీ ధ్వంసం చేసి డబ్బు అపహరించడంతోపాటు అమ్మవారి కిరీటం, ముక్కుపుడక సైతం ఎత్తుకెళ్లారు.
- మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని రాంపూర్ పెద్దమ్మ ఆలయంలోని హుండీ ధ్వంసం చేశారు.
- మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బొడ్మాట్‌పల్లిలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు, అమ్మవారి మంగళసూత్రం, ముక్కుపుడక చోరీ చేశారు.
- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్ల మల్యాల పెద్దమ్మ గుడి, సిద్దన్నపేట మాంకాలమ్మ ఆలయంలో దొంగలు హుండీలతో ఉడాయించారు.
- సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి బంగారు పుస్తెలతాడు అపహరించారు.
- సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్లలోని ఆంజనేయ స్వామి ఆలయంలోని రాతి కలశాన్ని గుర్తుతెలియని వ్యక్తులు మాయం చేశారు.
- సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రాంసాగర్‌లోని పెద్దమ్మ ఆలయ గేటుతాళాలు ధ్వంసం చేసి అమ్మవారి ముక్కుపుడక, మైక్‌సెట్, హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. వారం క్రితమే అనాజీపూర్‌లోని పెద్దమ్మ ఆలయంలోనూ చోరీ జరిగింది.
- సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ హుండీ లెక్కింపు సమయంలోనూ కానుకలుగా వచ్చిన బంగారు ఆభరణాలను తస్కరించారని ఆలయ ఈవో పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని రుద్రారం వీరాంజనేయ ఆలయంలో జూన్ 11న దొంగలు హుండీని అపహరించారు.
- సంగారెడ్డి జిల్లా భానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందిగామ దుర్గామాత ఆలయంలో హుండీని పగలగొట్టి కానుకలను దోచుకెళ్లారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సీజనల్ వ్యాధులను

సీరియస్‌గా తీసుకోండి

- పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేయొద్దు
- ఇంటింటి సర్వే నిర్వహించాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 19 : డెంగీ, సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి అన్ని శాఖలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది వైద్యాధికారులు ఇంటింటి సర్వే చేసి సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రెయినీ కలెక్టర్ మనోజ్, డీపీవో సాయిబాబా, ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో డా.గాయత్రి, డీఆర్‌డీవో పీడీ జ్యోతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన ప్రజావాణి

సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి వెలవెబోయింది. ప్రతీ సోమవారం అర్జీదారులతో సందడిగా ఉండే ప్రజావాణికి ఈసారి రాఖీ పౌర్ణమి కావడంతో ఫిర్యాదుదారులు నామమాత్రంగా వచ్చారు. 23 అర్జీలు రాగా కలెక్టర్ క్రాంతి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘానికి 500 గజాల స్థలం కేటాయించాలని టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు వటపత్రశాయి అర్జీ అందజేశారు. ట్రెయినీ కలెక్టర్ మనోజ్, ఏవో పరమేశం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే

పరిష్కరించాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రజావాణికి 63 అర్జీలు

మెదక్ అర్బన్, ఆగస్టు 19: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మెదక్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలస్థాయిలో ఫిర్యాదులు పరిష్కారం కాకపోవడంతోనే ప్రజలు జిల్లా కేద్రానికి వస్తారని, వారి ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజావాణికి మొత్తం 63 అర్జీలు రాగా.. ఇందులో రుణమాఫీ 22, ధరణి 19, పింఛన్ 4, ఇతర సమస్యలకు సంబంధించి 22 దరఖాస్తులు ఉన్నాయి. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సులభమైన అభ్యసనానికి

'లర్నింగ్ మై స్లేట్'

రూపొందించిన సోషల్ టీచర్ 7 లో



సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో జలమయమైన అంగడిబజారు చౌరస్తా



సిద్దిపేట జిల్లా మద్దూరులో దంచికొడుతున్న వర్షం

వదలని వాన..

- ఉమ్మడి మెదక్ జిల్లాలో జడివాన
- అత్యధికంగా సిద్దిపేట జిల్లా దుళ్మిట్టలో 10.6 సెం.మీ.ల వర్షపాతం
- మరో రెండ్రోజులు వర్ష సూచన

మెదక్ అర్బన్, ఆగస్టు 19: ఉమ్మడి మెదక్ జిల్లాలో సోమవారం కూడా వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వానతో ప్రధాన రహదారులపై నీరు చేరి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో రోడ్లపై వరద నీరు ప్రవహించింది. సిద్దిపేట జిల్లాలో రికార్డు స్థాయిలో కుండపోత వర్షం కురిసింది. ఈ సీజన్‌లో అత్యధికంగా దుళ్మిట్టలో 10.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. చట్లపల్లి 9.4సెం.మీ., గండిపల్లి 8.9సెం.మీ., కట్కూర్ 8.4 సెం.మీ., కొమురవెల్లి 8.2 సెం.మీ., కొడకండ్ల 6.9 సెం.మీ., ముస్త్యాల 6.9 సెం.మీ., సంగారెడ్డి జిల్లా సదాశివపేట 3.2 సెం.మీ.ల వర్షం కురిసింది. మెదక్ జిల్లాలో మోస్తరు నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి. రానున్న 24 గంటలు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది.













కేతకీలో భక్తుల సందడి

ఝరాసంగం, ఆగస్టు 19: దక్షిణా కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీకేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం మూడో సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడం వల్ల ఆలయ ఆవరణ భక్తులతో సందడిగా మారింది. ఉదయం అమృత గుండంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ ఆవరణలో నవగ్రహాలకు తైలం, నువ్వులు, నల్లని వస్త్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారుల అన్ని ఏర్పాట్లు చేపట్టారు. స్థానిక పోలీస్ సిబ్బంది బందోబస్తు చేశారు.


ఎంపీకి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఎంపీ సురేష్ షెట్కార్ పూజలు

కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ సోమవారం కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో ఎంపీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి శశిధర్ గుప్తా, కాంగ్రెస్ నాయకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హనుమంతురావు పాటిల్, కాంగ్రెస్ నాయకు భాస్కర్ రెడ్డి, శంకర్ పాటిల్, వేణుగోపాల్ రెడ్డి, శంకర్,అశ్రఫ్ అలీ, రుద్రయ్య స్వామి, తదితరులు పాల్గొన్నారు.





ఖేడ్‌లో వైభవంగా మహారుద్రయాగం

నారాయణఖేడ్,ఆగస్టు 19: నారాయణఖేడ్ పట్టణంలోని చారిత్రాత్మకమైన కాశీనాథ్ ఆలయంలో శ్రావణ మాస మూడో సోమవారాన్ని పురస్కరించుకొని మహారుద్ర యాగం, రుద్రాభిషేకం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గురురాజశర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. అనంతరం పురోహితులు గురుజోషి మాట్లాడుతూ.. ఈ ఏడాది శ్రావణమాసం చాలా విశేషమైందని, ఈ మాసంలో మొత్తం ఐదు సోమవారాలురావడంతో రుద్రయాగాలు నిర్వహిస్తున్నామన్నారు. నారాయణఖేడ్ కాశీనాథుడిని దర్శిస్తే కాశీవిశేశ్వరుడిని దర్శించినంత పుణ్యఫలం లభిస్తుందన్నారు. అనంతరం భక్తులకు మహాప్రసాదాన్ని అందించారు.

రాచన్నస్వామికి లక్ష బిల్వార్చన


ఆలయంలో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న భక్తులు

కోహీర్, ఆగస్టు 19: మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల శ్రీ రాచన్నస్వామి ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని స్వామివారికి లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా మూడో సోమవారమే రాఖీ పౌర్ణమి కూడా రావడంతో బిల్వార్చన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. స్వామివారికి బిల్వార్చనతో పాటు అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణ మాసం ముగింపు వరకు స్వామివారి సన్నిధిలో బిల్వార్చన కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. బిల్వార్చనలో పాల్గొనదలచిన భక్తులు ముందస్తు సమాచారం తెలియజేసి కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

మాసాయిపేటలో ఘనంగా మహంకాళి జాతర

మాసాయిపేట, ఆగస్టు 19: మండల కేంద్రంలో జరుగుతున్న మహంకాళి జాతర ఉత్సవాలు రెండోరోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమగుండం, పోతురాజు వీరంగం ఉత్సవ సమితి, నృత్యాలు డప్పుచప్పులతో ఘనంగా బోనాలతో వేడుకలను నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. వేడుకల్లో మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా నాయకులు కృష్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, భూస్వామి, వేణు, సత్యనారాయణ, నాగరాజు, వివిధ పార్టీల నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ వర్గాల ప్రజలు, పెద్ద ఎత్తున జాతరలో పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సిద్ధం చేయాలి: ఎంపీడీవో


ఓటరు జాబితాపై కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

కోహీర్ ఆగస్టు 19: గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు వార్డుల వారీగా గ్రామాల ఓటరు జాబితాను సిద్ధం చేయాలని ఎంపీడీవో భారతి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన కోహీర్‌లోని ఎంపీపీ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా రూపకల్పన, వార్డుల విభజనపై ఎంపీడీవో భారతి కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల ఓటరు లిస్టును ప్రామాణికంగా కొత్త ఓటరు జాబితాను రూపొందించాలన్నారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలుసుకోవడానికి జాబితాను గ్రామపంచాయతీ వద్ద ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వం నుంచి ఎప్పుడు ఆదేశాలు వచ్చినా ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వినోద్‌కుమార్, కోహీర్ మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి విస్కీన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

చిట్కుల్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 19: ఒక్క ఫొటో ఎన్నో జ్ఞాపకాలను పంచుతుందని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఇస్నాపూర్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నీలం మధు కేక్ కట్ చేసి ఫొటోగ్రాఫర్లందరికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ సందర్భంలో మనం తీసుకున్న ఫొటోల ఆల్బంను తడిమి చూస్తే ఎంతో సంతోషాన్ని పంచుతాయన్నారు.


లూయిస్ డాగురె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలం మధు



ఊపిరాడటం లేదు

విషం చిమ్ముతున్న పరిశ్రమలు
- ముక్కుపుటాలు అదిరే దుర్వాసన
- కాల్వలై పారుతున్న వ్యర్థ జలాలు
- శాంపిల్స్ తీసుకొని చేతులెత్తేస్తున్న పీసీబీ
- ఫిర్యాదు చేసినా.. పట్టని వైనం


రాత్రి సమయంలో ఓ పరిశ్రమ నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యం

హత్నూర, ఆగస్టు 19: రసాయన పరిశ్రమలు విషం చిమ్ముతున్నాయి. జల, వాయు కాలుష్యంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముక్కుపుటాలు అదిరే దుర్వాసనతో ఊపిరాడని పరిస్థితి నెలకొంది. అర్ధరాత్రి సమయంలో పరిశ్రమల్లోనే వ్యర్థ జలాలు, వాయువును వదులుతుండటంతో ఎవరికి చెప్పాలో తెలియక జనం ముక్కుమూసుకుని బతుకుతున్నారు. కాలుష్యాన్ని నియంత్రించాల్సిన అధికారులు అటువైపు చూడకపోవడంతో కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు ఆడిందే ఆటగా మారింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని గుండ్లమాచునూర్ శివారు పలు పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో కొన్ని పరిశ్రమలు నిబంధనలను గాలికి వదిలేశాయి. పరిశ్రమల నుంచి యథేచ్ఛగా జల, వాయు కాలుష్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా బయటకు వదిలేస్తున్నారు. వాయు కాలుష్యాన్ని సమయం సందర్భం లేకుండా వదులుతుండగా, వ్యర్థ జలాలను మాత్రం పరిశ్రమ ఆవరణలో నిర్మించిన ట్యాంకుల్లో నిల్వచేసి పక్కనే ఉన్న నక్కవాగులోకి వదులుతున్నారు. కొన్ని పరిశ్రమలు అర్ధరాత్రి వేళ కలుషిత వ్యర్థ జలాలను విడుదల చేస్తుండటంతో గ్రామస్థులు పట్టుకుని పీసీసీ టాస్క్‌ఫోర్స్ అధికారులకు ఆ నీటి శ్యాంపిళ్లు.. వ్యర్థ జలాలు విడుదల చేస్తున్న పరిశ్రమ వివరాలను అందించారు.


వీవోసీ మీటరులో వాయు కాలుష్య గాఢతను చూపుతున్న దృశ్యం

కూలీలు రావడం లేదు..

గుండ్లమాచూనూర్ గ్రామ శివారులోని రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న విషవాయువుల కారణంగా ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఇళ్లలో నుంచి బయటకు వస్తే విష వాయువులను పీల్చలేక ఊపిరాడని పరిస్థితి నెలకొంటుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటికి వచ్చిన బంధువులు ఉండలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమల పరిసరాలలోని పంట పొలాల్లో పనులకు కూలీలు రావడం లేదని రైతులు వాపోతున్నారు.

ఫిర్యాదు చేసినా.. పట్టని అధికారులు

రసాయన పరిశ్రమల నుంచి విడుదలవుతున్న జల, వాయు కాలుష్యం గురించి నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసినా.. ప్రయోజనం లేకుండా పోతుందన్న విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా పీసీబీ అధికారులు పరిశ్రమను తనిఖీ చేసే సమయంలో ముందస్తు సమాచారం ఇచ్చి వస్తుండడంతో పరిశ్రమల యాజమాన్యాలు దిద్దుబాటు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తుంది. పలుమార్లు పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థ జలాల శాంపిల్స్ సేకరించిన పీసీబీ అధికారులు వారిపై ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఫిర్యాదు చేస్తే బెదిరింపులు

పరిశ్రమల ఆగడాలపై స్థానికులు ఎవరైనా అధికారులకు ఫిర్యాదు చేస్తే, బెదిరింపులకు గురిచేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పరిశ్రమల తీరుపై ఎవరు ఫిర్యాదు చేసినా.. వారికి పోలీసుల నుంచి ఫోన్లు రావడం పట్ల విమర్శలకు తావిస్తుంది.

కోర్టులు మొట్టికాయలు వేసినా..

గ్రామ శివారులోని పరిశ్రమల నుంచి వెలువడుతున్న జల, వాయు కాలుష్యంపై హైకోర్టు మొట్టికాయలు వేసినా, పరిశ్రమల యాజమాన్యాల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. గ్రామంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి పరిశ్రమల కాలుష్యం తీరుపై జిల్లా కోర్టుతో పాటు హైకోర్టుకు ఉత్తరం రాసి తన ఆవేదనను వెళ్లగక్కాడు. అప్పట్లో కోర్టు ఆదేశాలతో ఆగమేఘాల మీద దిద్దుబాటు చర్యలు చేపట్టినా, ప్రస్తుతం పరిశ్రమలు యథావిధిగానే విషం చిమ్ముతున్నాయి.

ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం

గ్రామ శివారులోని రసాయన ఫార్మా పరిశ్రమలపై ఏ మాత్రం సమాచారం వచ్చినా, తాము, తమ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని విచారణ చేస్తున్నాం. ఇప్పటికే వీవోసీ మీటరుతో వాయు కాలుష్యాన్ని పసిగట్టడంతో పాటు, వ్యర్థ జలాల శాంపిల్స్ సేకరిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే పరిశ్రమలపై చర్యలు తీసుకుంటాం.

- గీత, పీసీబీ ఈఈ


గుండ్లమాచునూర్ గ్రామ సమీపంలో ఓ పరిశ్రమ అవుట్‌లేట్‌లో నుంచి బయటకు వస్తున్న వ్యర్థ జలాలు

గ్రామంలో బతకలేకపోతున్నాం



మా గ్రామాన్ని ఆనుకొని ఉన్న కంపెనీల నుంచి వస్తున్న విషపూరిత కాలుష్యంతో గ్రామంలో బతకలేకపోతున్నాం. ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే అనేక అవస్థలు పడుతున్నాం. పలు సందర్భాలలో కంపెనీల వాసన వల్ల శ్వాస ఆడడం లేదు.

- నిజాముద్దీన్, గుండ్లమాచునూర్

ఫిర్యాదు చేసినా, అధికారులకు పట్టడం లేదు



పరిశ్రమల నుంచి విషపూరిత వాయువులు వెలువడుతుండడంతో గ్రామ ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ వేల రూపాయలు ఖర్చు పెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. పరిశ్రమల కాలుష్యంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. గ్రామ ప్రజలను కూడగట్టి కాలుష్య నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం.

- శంకర్, మాజీ వార్డుసభ్యుడు

తాటిపల్లిలో శతాధిక వృద్ధుడు మృతి


పెద్దగొల్ల మల్లయ్య (ఫైల్)

రేగోడు, ఆగస్టు 19: శతాధిక వృద్ధుడు పెద్దగొల్ల మల్లయ్య(109) ఈనెల 18న మృతిచెందగా... సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. రేగోడు మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య నెలరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందినట్లు కుమారుడు, కాంగ్రెస్ గ్రామ నాయకుడు పెద్దగొల్ల యాదయ్య తెలిపారు. మల్లయ్యకు 109 ఏళ్లు ఉన్నప్పటికీ ఆరోగ్యంగా ఉంటూ రోజువారి పనులు యథావిధిగా చేసుకునేవాడన్నారు. స్వాతంత్ర్య ఉద్యమాలను చూశాడని గ్రామస్థులు తెలిపారు.

గౌరాయపల్లిలో పెళ్లి ఇంటిపై దాడి

● ముగ్గురిపై కేసు

చేర్యాల, ఆగస్టు 19: కొమురవెల్లి మండలం గౌరాయపల్లి గ్రామంలో ఓ వివాహ వేడుక జరుపుకుంటున్న ఇంటిపై ఆదివారం రాత్రి దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన శాకంపల్లి కరుణాకర్‌రెడ్డి కూతురు వివాహం జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగింది. అప్పగింతల అనంతరం కూతురు, అల్లుడికి గౌరాయపల్లి గ్రామంలోని తమ ఇంట్లో ఒడిబియ్యం పోస్తుండగా, ఇంటి ఆవరణలో కుటుంబసభ్యులు ఊరేగింపు చేపట్టారు. ఇంతలో పెద్ది మధుసూధన్‌రెడ్డి, నరెడ్ల కిరణ్‌రెడ్డి, నరెడ్ల అనిల్‌రెడ్డి కారులో ఇంటి ముందు నుంచి అతివేగంగా వెళ్లిన విషయంలో కరుణాకర్‌రెడ్డి కుటుంబీకులతో గొడవపడ్డారు. ఇరువర్గాల వారు వాగ్వాదానికి దిగి తోపులాడుకున్నారు. ఈ ఘర్షణలో కరుణాకర్‌రెడ్డి ఇంటి ఆవరణలోని పందిరి కూల్చివేసి రాళ్లతో ఇంటిఅద్దాలు ధ్వంసం చేశారు. దాడిలో కరుణాకర్‌రెడ్డి బంధువురాలైన రాణి తలకు గాయాలవడంతో 108 అంబులెన్సు ద్వారా చికిత్స నిమిత్తం సిద్దిపేటకు తరలించారు. దాడిలో తమ కుటుంబీకులకు గాయాలయ్యాయని, తమపై దౌర్జన్యం చేసిన ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పెద్ది మధుసూధన్‌రెడ్డి, నరెడ్ల కిరణ్‌రెడ్డి, నరెడ్ల అనిల్‌రెడ్డిపై కేసునమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎనిమిది గొర్రెలు మృతి

దౌల్తాబాద్, ఆగస్టు 19: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఎనిమిది గొర్రెలు మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి దొమ్మాట గ్రామంలో చోటు చేసుకున్నది. మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన అక్కమొళ్ల నర్సింహులు రోజు మాదిరిగానే గొర్రెలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం తోలుకొచ్చి తన ఇంటి పాకలో కట్టేశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం ఏర్పడి ఎనిమిది గొర్రెలు మృతిచెందాయి.ఒక్కొక్క గొర్రె విలువ రూ.13 వేలు ఉంటుందని, ఎనిమిది గొర్రెల మృతితో రూ.1 లక్ష ఆర్థికంగా నష్టపోయానని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు నరసింహులు కోరాడు.


మృతిచెందిన గొర్రెలు

ఎంజేపీ గురుకులాన్ని సందర్శించిన కలెక్టర్

● విద్యార్థులకు విద్యుత్ షాక్‌పై స్పందన


తునికి ఎంజేపీ గురుకుల పాఠశాలలో కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, ఆగస్టు 19: మండల పరిధిలోని తునికి ఎంజేపీ గురుకుల పాఠశాలలో 'విద్యార్థులకు విద్యుత్‌షాక్' అనే వార్త ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితం కావడంతో కలెక్టర్ రాహుల్‌రాజ్ స్పందించారు. సోమవారం ఉదయం మండల పరిధిలోని తునికి ఎంజేపీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో విద్యార్థులకు విద్యుత్‌షాక్ రావడానికి గల కారణాలను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హరిబాబుతో మాట్లాడి తెలుసుకున్నారు. విద్యుత్‌షాక్ వచ్చిన విషయం గోప్యంగా ఉంచిన విషయాన్ని ఆరాతీశారు. అనంతరం విద్యార్థులకు సకాలంలో ఆహార పదార్థాలు అందించడంతో పాటు పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

రాష్ట్రస్థాయి మహిళల ఫుట్‌బాల్ రన్నర్‌గా మెదక్ జిల్లా జట్టు



రన్నర్ కప్‌ను అందుకుంటున్న మెదక్ జిల్లా జట్టు

మెదక్ అర్బన్, ఆగస్టు 19: తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి మహిళల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిష్ పోటీలో మెదక్ జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. సోమవారం ఫైనల్స్‌లో నిజామాబాద్-మెదక్ జిల్లా జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా మ్యాచ్ జరుగుతుండగా.. భారీ వర్షం కారణంగా అంతరాయం ఏర్పడింది. దాంతో ఇరుజట్ల సమక్షంలో టాస్ వేయగా... విజేతగా నిజామాబాద్, రన్నర్‌గా మెదక్ జిల్లా ప్రకటించారు. విజేతలకు ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఫాల్గుణ, జిల్లా న్యాయమూర్తి సునీత చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు రామచందర్, ప్రశాంత్, కోచ్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, వినయ్, సభ్యులు చైతన్య, అజార్, బంటి, ఫణి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రులు దామోదర్, శ్రీధర్‌బాబుకు లర్నింగ్ మై స్లేట్ పనితీరును వివరిస్తున్న ఖేతావత్ థావుర్యానాయక్


లర్నింగ్ మై స్లేట్

సులభమైన అభ్యసనానికి లర్నింగ్ మై స్లేట్

- రూపొందించిన సోషల్ టీచర్
- అభినందించిన మంత్రులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 19: ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి చదువు నేర్పాలనే తపనతో అహర్నిశలు కష్టపడుతూ ఉంటారు. ఇందులో కొందరు పిల్లలు వేగంగా నేర్చుకుంటారు, మరికొందరు వెనుకబాటును ప్రదర్శిస్తారు. మన దగ్గరికి వచ్చిన వందమందికి వందమంది పిల్లలు చదువుకోవడానికి వస్తారు. కానీ కొందరు కనీసం చదవడం, రాయడంలో వెనకపడుతున్నారు. పిల్లలందరికీ సులభంగా విద్య రావాలని సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నాగారం జడ్పీహెచ్‌ఎస్ సోషల్ టీచర్ ఖేతావత్ థావుర్యానాయక్ ఆసక్తికరమైన ఒక 'లర్నింగ్ మై స్లేట్'ను రూపొందించారు. పిల్లలు డ్రా పౌట్స్ కాకూడదనే ఉద్దేశంతో తయారు చేశారు. ముఖ్యంగా పాఠశాలలో సమానమైన విద్యను అందించడం, రాయడం, గణిత ప్రక్రియలు సాధించడంలో ఎవరు వెనుకపడకుండా ఉండడానికి ఇది దోహదం చేస్తుంది. ఒకటే స్లేట్‌లో తెలుగు, ఆంగ్లం, హిందీ, గణిత ప్రక్రియలు ఏకకాలంలో నేర్చుకోవడానికి, విద్యార్థి ఎక్కడ వెనకబడి ఉన్నాడో తెలుసుకోవడానికి ఇది దోహద పడుతుంది. ఒకరకంగా చెప్పాలంటే బహుళ వినియోగం కలిగిన అభ్యసన ప్రక్రియ సాధనం అని చెప్పవచ్చు. ఈ స్లేటు పుస్తకానికి అనుబంధంగా విద్యాకరికులంలో చేరితే నాణ్యమైన విద్యను విద్యార్థి పొందడానికి బలమైన ఆస్కారం ఏర్పడనుంది. పాఠ్యపుస్తకం, గణిత ప్రక్రియలోనూ ఎన్నో కృత్యాలను మై స్లేట్ లో సాధన చేయడానికి వీలుపడుతుంది.

పనితీరు ఇలా

మై స్లేట్‌పై కనబడే అక్షరాలు.. చుట్టూ పలక మీద ఉంటాయి. తెలుగు సబ్జెక్టుకు సంబంధించి అక్కడ అచ్చులు, హల్లులు అనే వర్గీకరణ కూడా ఉంటుంది. అక్కడ అచ్చులతో హల్లు పదాలను జతచేస్తూ పదాల రూపకల్పన చేస్తారు. అలా రెండు అక్షరాల సరళ పదాలు, మూడు అక్షరాల సరళ పదాలు, ఆర్ తర్వాత గుణింత పదాలు అక్కడ సూత్రబద్ధంగా ప్రింట్ చేయబడ్డాయి. మై స్లేట్ అనే పలకపైన అక్షరాలను జతపరుస్తూ పదాలు నిర్మాణం చేస్తారు. ఉదాహరణకు అమ్మ అనే అక్షరాన్ని మా పక్కన మా వత్తు అక్షరాన్ని సున్న చుట్టి అ నుంచి అమ్మ వరకు అక్షరాన్ని జతపరుస్తాం. జత పరిచిన అక్షరాలను పలక మీద సున్నాలు గీయించి ఆ సున్నా లోపలే ఆ నిర్మాణం ఐడియాలజికల్‌గా మా కు కూడా ం లోనే ఎట్ల రాయాలో చూపించి అమ్మ అనే పదాన్ని పరిచయం చేస్తాం. ఆ పదాన్ని విద్యార్థి పలక మీద చూసి చేస్తాడు. కాబట్టి మర్చిపోకుండా అక్షరాలను గుర్తుపెట్టుకునే అవకాశం ఉంటుంది. గణితం విషయంలో అంకెలను లెక్కించడం కాకుండా బాక్సులను లెక్కిస్తూ అంకెలను చూపిస్తారు. ఇప్పుడు ఒకటి ఎదురుగా బాక్స్‌ని లెక్కిస్తాం. రెండుకి ఎదురుగా రెండు బాక్సు లెక్కిస్తాం. మూడుకెదురుగా మూడు బాక్సులను లెక్కిస్తాం అలా సున్నా నుంచి తొమ్మిది వరకు అంకెలను నేర్పించవచ్చు. అలాగే కింది వైపు నుంచి బాక్సులను తగ్గించుకుంటూ లెక్కించడం వల్ల తీసివేతను కూడా గుర్తు చేయవచ్చు.

మంత్రుల ప్రశంసలు

విద్యను సులభంగా నేర్చుకునేందుకు రూపొందించిన 'లర్నింగ్ మై స్లేట్'ను మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, సీతక్కలు అభినందించారు. స్టేట్ ఇన్నోవేషన్ సెల్(టీఎస్ఐసీ)ఇంటింటా ఇన్నోవేషన్ సెమినార్‌లో ప్రాథమిక విద్య నుంచి వయోజన విద్య వరకు ఆరునెలల్లో నూరు శాతం అక్షరాస్యత సాధించగలమని ఖేతావత్ థావుర్యానాయక్ మంత్రులకు వివరించారు. వారు ఆ స్లేట్‌ని చూసి దాన్ని త్వరలో శిశు సంక్షేమ విద్యాకరికులంలో చేర్చి రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ పిల్లలకు సులభంగా విద్య నేర్చుకోవడానికి, పంపిణీ చేయడానికి వారు సుముఖత వ్యక్తం చేశారు. రూ.98 నుంచి రూ.110 ఖర్చయ్యే ఈ స్లేట్‌ను మంత్రి శ్రీధర్‌బాబు నీడ్ ఫుడ్ ఇన్నోవేషన్‌గా గుర్తించి పాఠశాల విద్యాశాఖకు సిఫారసు చేసినట్టు థావుర్యానాయక్ తెలిపారు.

చేర్యాల, కొమురవెల్లిలో దంచి కొట్టిన వాన

- సీజన్ ప్రారంభమైన నాటి నుంచి తొలి భారీవర్షం
- జలమయమైన చౌరస్తాలు
- డ్రైనేజీ కాలువ నిర్మాణం అసంపూర్తి పనులతో అవస్థలు


కొమురవెల్లి మండలకేంద్రంలో జలమయమైన గాంధీ, తెలంగాణతల్లి విగ్రహ ఆవరణ

చేర్యాల/మద్దూరు/హుస్నాబాద్, ఆగస్టు 19: చేర్యాల పట్టణంతో పాటు రూరల్ మండలం, కొమురవెల్లి మండలాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాగు సీజన్ ప్రారంభమై మూడునెలలు కావస్తున్నా చిరుజల్లులే కురవగా, పంటల ఎదుగుదలకు అవసరమైన భారీవర్షం తొలిసారి కురవడంతో రైతుల్లో హర్షం రేకెత్తుతుంది. వర్షం కారణంగా చేర్యాల పట్టణంలోని పలు ప్రధాన చౌరస్తాలు జలమయమయ్యాయి. రోడ్డు విస్తరణలో భాగంగా పలు ప్రదేశాల్లో డ్రైనేజీ కాలువ పనులు నిలిచిపోవడంతో పాటు గాంధీచౌక్ వద్ద కల్వర్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వరద నీరు కాలువలోకి మళ్లే అవకాశం లేకపోవడంతో అంగడిబజారు, వీరభద్ర థియేటర్, ఓల్డ్ ఎస్‌బీఐ, గాంధీచౌక్ తదితర ప్రధాన చౌరస్తాలో రోడ్డుపై నిలిచిపోవడంతో ప్రజలు, ప్రయాణీకులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. మండలంలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి నీరు చేరడంతో ఇబ్బందులుపడ్డారు. అలాగే కొమురవెల్లి గ్రామంలోని జడ్పీఎస్ఎస్ ఆవరణ నుంచి గ్రామంలోపలికి వెళ్లే ప్రధానదారి జలయమమైంది. కొండపాక స్వాగత తోరణం నుంచి కొమురవెల్లి వరకు రోడ్డు విస్తరణ చేపట్టడంతో గ్రామం లోపలినుంచి వచ్చే వరదనీరు మళ్లించేందుకు చర్యలు చేపట్టకపోవడంతో నీరు నిల్వ ఉండి ప్రజలు అవస్థలుపడ్డారు. అలాగే మద్దూరు మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. చాలారోజుల తరువాత ఏకధాటిగా గంటపాటు వర్షం కురిసింది. దీంతో ప్రజలు, రైతులు హర్షం వెలిబుచ్చారు. మద్దూరు నుంచి చేర్యాల మండలం ముస్త్యాలకు వెళ్లేదారిలో ఉన్న రాగికుంట వర్రెలో నీటి ప్రవాహం అధికమవ్వడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్రెదాటి పోలేని పరిస్థితి మూలంగా వాహనదారులు వెనుదిరిగారు. హుస్నాబాద్ పట్టణంలో సోమవారం రాత్రి జోరు వర్షం కురిసింది. దాదాపు గంటకుపైగా ఎడతెరపి లేకుండా వర్షం కురియడంతో పట్టణంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. గత పదిరోజులుగా వర్షాలు లేక పంట ఎండిపోతున్న తరుణంలో కురిసిన వర్షం రైతులకు ఎంతో ఊరటనిచ్చింది.

వర్షానికి కూలిన ఇల్లు.. తప్పిన ప్రాణాపాయం

చిన్నశంకరంపేట, ఆగస్టు 19: వారంరోజులుగా కురుస్తున్న వర్షానికి చిన్నశంకరంపేట మండలం మలుపల్లి గ్రామంలో సోమవారం రాత్రి ద్యానబోయిన సాయిలు ఇల్లు కూలిపోయింది. ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. దీంతో అక్కడున్న కాలనీవాసులు, ఇంటి వారు ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షానికి గోడలు పూర్తిగా దెబ్బతిని కూలినట్లుగా బాధితులు తెలిపారు. ఇల్లు కూలి పోవడంతో బాధిత కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు సాయిలు, యాదమ్మ దంపతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

పెద్దశంకరంపేటలో భారీ వర్షం

● రోడ్లపై పొంగిపొర్లిన మురుగు కాలువలు

పెద్దశంకరంపేట, ఆగస్టు 19: పెద్దశంకరంపేటలో సోమవారం మధ్యాహ్నం దాదాపు గంటసేపు ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వర్షం కురియడంతో పెద్దశంకరంపేటలోని పలు మురుగు కాలువలు పొంగి పొర్లాయి. దీంతో రహదారులపై మురుగు నీరు, వర్షపు నీటితో కలిసి రోడ్లపై పారాయి. పాత గ్రామ పంచాయతీ వీధి వద్ద, పోచమ్మ దేవాలయం వద్ద, పలు కాలనీల్లో మురుగునీరు పొంగిపొర్లడంతో రహదారులు చిత్తడిగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


పెద్దశంకరంపేటలో పాత గ్రామపంచాయతీ వద్ద పొంగిపొర్లుతున్న మురుగునీరు

పిడుగుపాటుతో ఆవు మృతి

కోహెడ, ఆగస్టు 19: మండలంలోని బస్వాపూర్ పరిధిలోని ముత్తన్నపేట గ్రామంలో సోమవారం పిడుగుపాటుకు పాడి ఆవు మృతిచెందింది. గ్రామానికి చెందిన కేడిక కిషన్‌రెడ్డి పాడి ఆవును పొలం వద్ద మేపుతూ ఉన్నాడు. సోమవారం సాయంత్రం వర్షం పడుతున్న సమయంలో పిడుగుపాటుకు గురై ఆవు మృతిచెందింది. మృతిచెందిన ఆవు విలువ రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.


చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో ఇంట్లోకి ప్రవహించిన నీటిని తొలగిస్తున్న చిన్నారులు


ఎండీఆర్: మద్దూరు మండలం ధర్మారం గ్రామంలో భారీ వర్షానికి ఇంటిముందు చేరిన నీళ్లు


చిన్నశంకరంపేట మండలం మలుపల్లి గ్రామంలో వర్షానికి కూలిన ఇల్లు



సంగారెడ్డి రూరల్: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు రాఖీ కడుతున్న చిన్నారులు



సంగారెడ్డి రూరల్: మాజీ మంత్రి హరీశ్‌రావుకు రాఖీ కడుతున్న మాజీ జడ్పీటీసీ సునీత



రామచంద్రాపురం: మాజీ మంత్రి కేటీఆర్‌కు రాఖీ కడుతున్న కార్పొరేటర్ వి.సింధూఆదర్శరెడ్డి



మునిపల్లి: అన్నకు రాఖీ కడుతున్న చెల్లి



రామచంద్రాపురం: రాష్ట్ర బీజేపీ నాయకుడు అంజిరెడ్డికి రాఖీ కడుతున్న బీజేపీ మహిళా నాయకులు



మునిపల్లి: అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌కు రాఖీ కట్టిన మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షి



జహీరాబాద్: ఎమ్మెల్యే మాణిక్‌రావుకు రాఖీని కడుతున్న బ్రహ్మకుమారీ సంస్థ సభ్యురాలు



కల్హేర్ మండలంలోని ఖానాపూర్(కె)లో చిన్నారికి రాఖీ కడుతున్న బాలుడు

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



సిర్గాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీలో ఒకరికొకరు రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థినులు

సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా భావించే రక్షా బంధన్ వేడుకలు సోమవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా జరుపుకున్నారు. రాఖీపౌర్ణమి సందర్భంగా సాధారణ ప్రజలతో పాటు రాజకీయనాయకులు మహిళలతో రాఖీలు కట్టించుకున్నారు. చెల్లెళ్లు సోదరులకు హారతులతో రక్షాబంధనం గావించి, ఆప్యాయంగా స్వీట్లు తినిపించి ఆడపడుచు కట్నాలు స్వీకరించారు. దూర ప్రాంతాల నుంచి ఆడపడచులు పుట్టింటికి వచ్చి సందర్భంగా ఇళ్లలో పండుగ వాతావరణం చోటు చేసుకున్నది. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు సదాశివపేటలోని ఆయన నివాసంలో శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సంగారెడ్డి మాజీ జడ్పీటీసీ సునీతామనోహర్‌గౌడ్ హైదరాబాద్‌లో మాజీమంత్రి హరీశ్‌రావు నివాసంలో రక్షాబంధనం చేశారు. అదేవిధంగా మాజీ మంత్రి హరీశ్‌రావు, అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌కు మునిపల్లి మండల మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షిసాయికుమార్ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రామచంద్రాపురం మండలం జీహెచ్‌ఎంసీ పరిధిలోని భారతీనగర్ కార్పొరేటర్ వి.సింధూఆదర్శరెడ్డి మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రామచంద్రాపురం కార్పొరేటర్ బి.పుష్పానగేష్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి రాఖీ కట్టారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు సి.అంజిరెడ్డికి మహిళా నాయకులు రాఖీలు కట్టారు. జహీరాబాద్‌లో బ్రహ్మకుమారి సంస్థకు చెందిన సభ్యులు ఎమ్మెల్యే మాణిక్‌రావుకు రాఖీని కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సిర్గాపూర్ కేజీబీవీలో విద్యార్థినులు తయారు చేసిన రాఖీలు ఒకరికొకరు కట్టుకున్నారు. మెదక్ పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ సమీవుద్దీన్‌కు స్థానిక వెంకట్రావ్‌నగర్ కాలనీ మహిళలు రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల సంబంధానికి కులమతాలతో పట్టింపు లేదని చాటి చెప్పారు. తనకు ఐదేళ్ల క్రితం రాఖీ కట్టినప్పుడు మధురానుభూతి పొందానని, నాటి నుంచి ఆనవాయితీగా రాఖీ కట్టించుకున్నట్టు కౌన్సిలర్ సమీవుద్దీన్ తెలిపారు. పెద్దశంకరంపేటలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 19



సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలంలోని కల్వానికుంట తండాలో రాఖీలు కట్టించుకున్న యువకులు



మెదక్ అర్బన్: మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ రాఖీ కడుతున్న సోదరీమణులు



మెదక్ అర్బన్: 11వ వార్డు కౌన్సిలర్ సమీవుద్దీన్‌కు రాఖీ కడుతున్న మహిళలు



పెద్దశంకరంపేట: శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో రక్షాబంధన్ వేడుకలు



హవేళిఘణపూర్‌లో తమ్ముళ్లకు రక్షాబంధనం చేస్తున్న సోదరి



చేగుంటలో సోదరులకు రాఖీలు కడుతున్న సోదరీ మణులు



చిన్నశంకరంపేటలో రాఖీలు కడుతున్న చిన్నారి



వెల్దుర్తి: సోదరులకు రాఖీలు కడుతున్న సోదరీమణులు



కొడిపల్లిలో అన్నదమ్ములకు రాఖీలు కడుతున్న అక్క చెల్లెళ్లు

బోనాల ఉత్సవాల్లో నీలం మధు



ఉత్సవాల్లో నీలం మధు తదితరులు

శివ్వంపేట, ఆగస్టు 19: సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని గ్రామ దేవతలను కోరుకున్నట్టు కాంగ్రెస్ నాయకుడు నీలం మధు, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాలకు కాంగ్రెస్ నాయకులు నీలం మధు, రాజిరెడ్డి మదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆంజనేయులుగౌడ్, సువాసినిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, శేషసాయిరెడ్డి, నవీన్ గుప్తా, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

నర్సాపూర్ తహసీల్దార్ బదిలీ

నర్సాపూర్, ఆగస్టు 19: నర్సాపూర్ తహసీల్దార్ కమలాద్రి శివ్వంపేటకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మెదక్ తహసీల్దార్ కె.శ్రీనివాస్ నర్సాపూర్‌కు బదిలీపై రానున్నారు.

అల్లాదుర్గం తహసీల్దార్‌గా మల్లయ్య



అల్లాదుర్గం, ఆగస్టు 19: అల్లాదుర్గం తహసీల్దార్‌గా మల్లయ్య సోమవారం పదవీ బాధ్యత లను స్వీకరించారు. ఆయన కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన సతీష్‌కుమార్ పాపన్నపేట మండలానికి బదిలీ అయ్యారు.

వెల్దుర్తి తహసీల్దార్‌గా కృష్ణ



వెల్దుర్తి, ఆగస్టు 19: వెల్దుర్తి తహసీల్దార్‌గా కృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు వెల్దుర్తి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన తులసీరామ్ టేక్మాల్ మండలానికి బదిలీ అయ్యారు. టేక్మాల్ మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన కృష్ణ బదిలీపై వెల్దుర్తికి వచ్చారు.

డిప్యూటీ సీఎంను కలిసిన విద్యుత్ ఉద్యోగులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 19: విద్యుత్ శాఖలో సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 220 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినందుకుగాను హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సోమవారం విద్యుత్ తెలంగాణ ఉద్యోగుల సంఘం (327 ఐఎన్‌టీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘం నాయకులు కలిసి ధన్యవాదాలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో విద్యుత్ యూనియన్ నాయకులు ఈశ్వరప్ప, గోవింద్‌రావు, విజయ్‌రావు, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎంను కలిసిన తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్‌రెడ్డి

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ కల్పించండి



సంగారెడ్డిలో వ్యవసాయాధికారి నర్సింహారావుకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 19: జిల్లాలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ కల్పించాలని రైతుసంఘం రాష్ట్ర నాయకుడు జయరాజ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావుని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది రైతులు రుణమాఫీకాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పి రేషన్ కార్డు మెలిక పెట్టడం రైతులను మోసం చేయడమేనన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య, నాయకులు మాణిక్‌రెడ్డి, మల్లారెడ్డి,జైపాల్‌రెడ్డి, రైతులు సిధాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

అర్హులకు రుణమాఫీ అందకపోవడం బాధాకరం

వెల్దుర్తి, ఆగస్టు 19: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అందకపోవడం బాధాకరమని మెదక్ జిల్లా రైతు రక్షణ సమితి గౌరవ అధ్యక్షులు మైసయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రప్రభుత్వం మూడు విడుతల్లో రుణమాఫీ విడుదల చేసినా, అర్హులైనవారికి రుణ మాఫీ రాలేదన్నారు. రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ రాని అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

మాసాయిపేట, ఆగస్టు 19: అర్హత కలిగి రుణమాఫీ అందని రైతులు ప్రత్యేక ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి రజిత పేర్కొన్నారు. అర్హత కలిగి ఏవైనా బ్యాంకు పాస్ బుక్కులో పొరపాట్లు ఉంటే, లేదా వ్యవసాయ పాస్‌బుక్‌లో పొరపాటు వల్ల రుణమాఫీ పొందని రైతులు తమ ఆధార్ కార్డు పాస్‌బుక్కు జిరాక్సులతో ప్రత్యేక ఫారం ద్వారా మండల వ్యవసాయ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత రైతువేదికలో, వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఏఈవో కోరారు.

గత పంచాయతీ పాలకవర్గం అవినీతిపై విచారణ జరిపించండి

● అనంతారం గ్రామస్థుల డిమాండ్

గుమ్మడిదల, ఆగస్టు 19 : అనంతారం గ్రామపంచాయతీ పరిధిలో గత పాలకులు నిధులు పూర్తిగా దుర్వినియోగం చేసి అవినీతికి పాల్పడ్డారని తక్షణమే జిల్లా పంచాయతీ అధికారులు విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని అనంతారం గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు ప్రజలు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలోని అనంతారం గ్రామపంచాయతీ పరిధిలోని హనుమాన్ ఆలయ ఆవరణలో గ్రామస్థులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ మద్దతుతో గెలిచిన గత పంచాయతీ పాలకవర్గ సభ్యులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎప్పుడో కొన్నేళ్ల క్రితం వేయించి వేయించిన బోర్లకు మళ్లీ తమ హయాంలో బోర్లు వేశామని చెప్పి నిధులు కాజేశారని ఆరోపించారు. ఇలా వేర్వేరు పనులకు సంబంధించి రూ.లక్షల్లో దోపిడీ జరిగిందన్నారు. తమ కుటుంబ సభ్యుల పేరుమీద చెక్కులు పంపిణీ చేసుకున్నట్టు పంచాయతీ రికార్డుల్లో నమోదైందని తెలిపారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేసి అవినీతి పాల్పడిన గత పాలకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఉపసర్పంచ్ ఇప్ప భూపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గోస్కొండ దయాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొమ్ము కిష్టయ్య మాజీ వార్డు సభ్యులు ఇంద్రసేనారెడ్డి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అనంతారంలో మాట్లాడుతున్న గ్రామపెద్దలు

పలుచోట్ల యజ్ఞోపవీతధారణ కార్యక్రమాలు



బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం

జహీరాబాద్, ఆగస్టు 19: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం జహీరాబాద్ పట్టణంలో బ్రాహ్మణసేవా సంఘం ఆధ్వర్యంలో నూతన యజ్ఞోపవీత ధారణ(ఉపాకర్మ) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా హోమ క్రతువును నిర్వహించి గాయత్రీమాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం నాయకులు రాజ్‌కుమార్ దేశ్‌పాండే, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘాల ఆధ్వర్యంలో..



నారాయణఖేడ్‌లో యజ్ఞోపవీతధారణలో పద్మశాలీలు

నారాయణఖేడ్, ఆగస్టు 19: ఖేడ్ పట్టణ శివార్లలోని మార్కండేయ భవన్‌లో స్థానిక పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నూలు పౌర్ణిమను పురస్కరించుకొని, యజ్ఞోపవీతకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గణపతిపూజ, హోమం, యజ్ఞోపవీతధారణ కార్యక్రమాలను నిర్వహించారు.

మెదక్ జిల్లాలో..



పెద్దశంకరంపేట: మార్కండేయ మందిరంలో పద్మశాలీల యజ్ఞోపవీతధారణ కార్యక్రమం

● పెద్దశంకరంపేట/ రామాయంపేట: అన్నా, చెల్లెలు, అక్క, తమ్ముళ్ల అనురాగానికి ప్రతీకగా నిలిచే రాఖీపౌర్ణమి వేడుకలను పెద్దశంకరంపేట మండలంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు కుటుంబ సభ్యులతో పాటు నూతన వస్త్రాలు ధరించి పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కండేయ మందిరంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సామూహికంగా యజ్ఞోపవితం ధరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మండలపద్మశాలీ సంఘం అధ్యక్షులు గుజ్జరి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రామాయంపేటలోని స్థానిక మార్కండేయ ఆలయంలో పద్మశాలీలు హోమం నిర్వహించి, నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో న్యాయ కళాశాలను ఏర్పాటు చేయండి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 19 : సంగారెడ్డి జిల్లాలో న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. హైదరాబాద్‌లో అయనను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి, నాయకులు అశోక్, ఇసాక్, లింగం, ఆసిఫ్ తదితరులు ఉన్నారు.

నర్సంపల్లిలో మహిళ అదృశ్యం



లక్ష్మణ్(ఫైల్)

తూప్రాన్, ఆగస్టు 19: భర్తతో గొడవపడి సోదరుడి వద్దకు వచ్చిన మహిళ ఇంట్లోంచి బయటకు వెళ్లి అదృశ్యమైంది. ఈ సంఘటన మండలంలోని నర్సంపల్లిలో చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంటకు చెందిన తుడుం కరుణాకర్, తుడుం మరియమ్మ అలియాస్ పెంటమ్మ(32) దంపతులు కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఈ నెల 5న దంపతుల మధ్య గొడవ జరిగింది. అదేరోజు మరియమ్మ తూప్రాన్ మండలంలోని నర్సంపల్లిలో ఉంటున్న సోదరుడు తునికి హనుమంతు ఇంటికి వచ్చింది. భర్త కరుణాకర్ ఫోన్ చేయగా ఇంటికి వచ్చిందని హనుమంతు తెలిపాడు. ఈనెల 15న రాత్రి 11 గంటలకు మరియమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లింది. బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు భర్త సోమవారం పిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

పీడీఎఫ్ బియ్యాన్ని తరలిస్తున్న లారీ సీజ్



పోలీసులు సీజ్ చేసిన లారీ

చేగుంట, ఆగస్టు 19: చేగుంట మండల ఇబ్రాహీంపూర్ తిరుమల రైస్‌మిల్‌కు పీడీఎఫ్ బియ్యాన్ని లారీలో అక్రమంగా తరలించిన విషయం తెలిసిందే. సోమవారం సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ సాదిక్ తిరుమల రైస్ మిల్లును సీజ్ చేసి కేసు నమోదు చేశారు. లారీని సీజ్ చేసీ పీఎస్‌కు తరలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నర్సింగ్ యాదవ్, పోలీసులు ఉన్నారు.

నిజాయితీ చాటిన ఫొటోగ్రాఫర్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 19: తనకు దొరికిన రూ. 30వేల విలువైన సెల్‌ఫోన్‌ను బాధితుడికి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు పోలీస్ ఫొటోగ్రాఫర్. సంగారెడ్డి పోలీస్ శాఖలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న చిరంజీవి ఉద్యోగ రీత్యా సోమవారం కార్యాలయానికి వెళ్తుండగా పట్టణంలోని రెడ్లాస్ హోటల్ వద్ద విలువైన సాంసంగ్ ఫోన్ రోడ్డుపై పడి వుండటాన్ని గమనించి పోలీస్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ యాదవరెడ్డికి అప్పగించారు. దీంతో ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి సదాశివపేట పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన అరుణ్‌కుమార్‌గా గుర్తించారు. అతడిని జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించి ఫోన్‌ను అప్పగించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఫోన్ దొరికిందనే సమాచారం రాగానే బాధితుడు అరుణ్‌కుమార్ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. నిజాయితీగా ఫోన్‌ను అప్పగించిన ఫొటో గ్రాఫర్ చిరంజీవిని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అభినందించారు.

నేటి నుంచి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

జిన్నారం, ఆగస్టు 19: మండలంలో ఈ నెల 19 నుంచి అక్టోబర్ 10 వరకు ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తుల పరిశీలన చేపట్టనున్నట్టు ఆర్‌ఐ జయప్రకాశ్ తెలిపారు. సోమవారం గడ్డపోతారం పంచాయతీలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రారంభించారు. గ్రామాలవారీగా మండలంలోని గడ్డపోతారంలో 19 నుంచి 22వరకు, కాజీపల్లి 23 నుంచి 30వరకు, నల్తూరు 30 నుంచి సెప్టెంబరు 9 వరకు, వావిలాల 3 నుంచి 5 వరకు, శివానగర్ 6 నుంచి 8 వరకు, రాళ్లకత్వ 9 నుంచి 10 వరకు, సోలక్‌పల్లి 11 నుంచి 14 వరకు, అండూరు 15 నుంచి 17 వరకు, ఊట్ల 18 నుంచి 19 వరకు, మాదారం 20 నుంచి 26 వరకు, లక్ష్మీపతిగూడెం 27 నుంచి 28 వరకు కొడకంచి 29 నుంచి అక్టోబర్ 1 వరకు పరిశీలన జరుపుతారు. ఇక జంగంపేటలో 2 నుంచి 3 వరకు, జిన్నారం, 4 నుంచి 8 వరకు, మంగంపేట 8నుంచి 10 వరకు దరఖాస్తుల పరిశీలన చేపట్టనున్నట్లు తెలిపారు. మొత్తం 2,228 దరఖాస్తులకు గాను 29 ఓపెన్ వెంచర్లు కాగా 2,199 నివాసాల దరఖాస్తులని తెలిపారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండల సర్వేయర్, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఆర్‌ఐ తెలిపారు.

ఖేడ్‌లో పారిశుధ్య పనులను తనిఖీ చేసిన కమిషనర్

నారాయణఖేడ్, ఆగస్టు 19: ఖేడ్ మున్సిపల్ పరిధిలో పారిశుధ్య పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అకస్మికంగా తనిఖీ చేశారు. తెల్లవారుజాము నుంచే పలు వార్డుల్లో పర్యటించిన ఆయన రోడ్లు, వీధుల్లో కార్మికుల పనితీరును పరిశీలించారు. గృహాల నుంచి తడి,పొడి చెత్త సేకరణ తీరును పరిశీలించిన తగిన సూచనలు చేశారు. మురుగు కాల్వల్లోంచి పూడికతీత పనులను పర్యవేక్షించారు.

రోడ్లపై చెత్త వేస్తే.. వారితోనే తీయిస్తాం

రహదారులపై గాని, రోడ్ల పక్కన ఎవరైనా దుకాణదారులు చెత్తను వేస్తే, వేసిన వారితోనే ఎత్తి వేయించడంతో పాటు జరిమానా విధిస్తామని స్థానిక మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఖేడ్ పట్టణంలోని ఓ మద్యం దుకాణం పక్కన చెత్త వేసి ఉండటంతో ఆ మద్యం దుకాణ యజమానితోనే చెత్తను ఎత్తివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల వద్దకు వచ్చే ఆటోల్లోనే చెత్తను వేయాలన్నారు.

ఖేడ్‌లో బస్సుల రాకపోకలు పర్యవేక్షించిన డీఎం

నారాయణఖేడ్, ఆగస్టు 19: రాఖీ పౌర్ణిమను పురస్కరించుకొని ఖేడ్ ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్‌లకు లింగంపల్లి, పటాన్‌చెరు, సంగారెడ్డి, జోగిపేట, పెద్దశంకరంపేట, నిజాంపేటల మీదుగా మూడు రోజులుగా ప్రత్యేక బస్సులను నడపుతుండడంతో, ఆయా చోట్ల బస్సుల రాకపోకలను పర్యవేక్షించేందుకు గాను పర్యవేక్షకులను నియమించిన సంగతి తెలిసిందే. సోమవారం ఖేడ్ రాజీవ్ చౌక్‌లో స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య సిబ్బందితో కలిసి బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు. ప్రయాణికులతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన చర్యలు చేపట్టారు.

అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తే జైలుకే..

కల్హేర్, ఆగస్టు 19: అమ్మాయిలను వేధింపులకు గురి చేసినా, ఎలాంటి ఇబ్బందులు పెట్టినా కఠిన చర్యలు తప్పవని సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల కొందరు మైనర్ అమ్మాయిల వెంటపడుతూ మాయ మాటలు చెప్పి వెంటపడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని, అలాంటి వారి సమాచారం తమకు అందజేస్తే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తే 20 సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు బానిసల కాకుండా తల్లిదండ్రులు కూడా ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని ఎస్‌ఐ సూచించారు.

కరెంట్ సరఫరాలో అంతరాయం

హవేళిఘణపూర్, ఆగస్టు 19; మండలంలోని వాడి, రాజిపేట సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినోద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

అభిషేక్ సాంగ్విని కలిసిన ఖేడ్ ఎమ్మెల్యే



అభిషేక్ సాంగ్వికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 19: రాష్ట్రం నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్న అభిషేక్ సాంగ్విని సోమవారం ఉదయం నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అభిషేక్ సాంగ్వి అభ్యర్థిత్వాన్ని పార్టీ ఖరారు చేయడంతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక కార్యకర్త విశ్వనాథ్‌కోట మృతి



విశ్వనాథ్(ఫైల్)

జహీరాబాద్, ఆగస్టు 19: ఆత్మబంధు పరివార్ వ్యవస్థాపకుడు, లింగాయత్ సమాజ్ నాయకుడు విశ్వనాథ్‌కోట(86) సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జహీరాబాద్ ప్రాంతంలో ఆయన ఎన్నో సామాజిక కార్యక్రమాలను చేపట్టినట్లు వారు వివరించారు. పట్టణంలోని లింగాయత్ సమాజ్ శ్మశానవాటికవద్ద గల రుద్రభూమి వద్ద అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

సీఐ దౌర్జన్యం పట్ల నర్సాపూర్‌లో న్యాయవాదుల నిరసన

నర్సాపూర్, ఆగస్టు 19: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కోర్టులో న్యాయవాదిగా పనిచేసే సంతోష్‌పై సీఐ దౌర్జన్యం చేయడాని నిరసిస్తూ సోమవారం నర్సాపూర్ కోర్టు న్యాయవాదులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి విధులు బహిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, కాజామోయినోద్దిన్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.